అక్కాచెల్లెమ్మలకు 'ఆసరా'

- అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- సున్నిపెంటలో వైఎస్సార్ ఆసరా సంబరాలు
- 334 స్వయం సహాయక సంఘాలకు లబ్ధి



పొదుపు మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు.

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్రంలో ఉన్న 79 లక్షల స్వయం సహాయక సంఘాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రుణబకాయిల చెల్లింపునకు ఆసరా పథకం కింద అక్కాచెల్లెమ్మలకు నగదును అందిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సున్నిపెంటలోని గ్రామసచివాలయం–2లో 4వ విడత ఆసరా పథకం కింద మండలంలోని 334 స్వయం సహాయక సంఘాలకు రూ.1,80,004,118 చెక్కును అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అందజేశారు. చెక్కును అందుకున్న పొదుపు మహిళలు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు పొదుపు మహిళలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టుకున్న బంగారం విడిపిసాన్తని, పొదుపు ఖాతాలలో ఎంత రుణం తీసుకున్నా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసంచేశాడన్నారు. రైతులను, విద్యార్థులను కూడా మోసం చేశాడని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని మోసం చేశాడని ఇవన్నీ ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు.

మాట తప్పని సీఎం జగనన్న

జగనన్న ఎన్నికల హామీలలో ఇచ్చిన నవరత్నాల పథకాలను తూచా తప్పకుండా చెప్పిన సమయానికి ప్రజలకు అందిస్తూ మాటతప్పని ముఖ్యమంత్రిగా పేరుతెచ్చుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. లంచాలకు, సిఫారసులకు తావులేకుండా, పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా అందిస్తున్న పారదర్శక పరిపాలన కావాలా? మోసాలతో కూడిన ప్రభుత్వాలు కావాలో? ప్రజలే తేల్చుకోవాలన్నారు. మీ ఓటుతో ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని, మాయమాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ రాజశేఖర్, ఏరియా కో–ఆర్డినేటర్ పుల్లయ్య, ఏపీఎం శివచెన్నరాయుడు, సీసీలు రాంప్రకాశ్, అయ్యన్న, వైఎస్సార్ సీపీ నాయకులు శిల్పాభువనేశ్వరరెడ్డి, మైనారిటీసెల్ కార్యదర్శి ఎం.ఏ.రజాక్, మండల అధ్యక్షులు జింకా.గుండయ్యయాదవ్, నాయకులు భరత్‌రెడ్డి, మహ్మద్‌ఖాసీం, పాపారావు, గౌస్‌మొహిద్దీన్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు రుణాలిచ్చి సహకరించండి

స్వయం సహాయక సంఘాలకు మరిన్ని ఆర్థిక రుణాలు ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని, బ్యాంకర్లు, డీఆర్‌డీఏ అధికారులను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కోరారు. గురువారం సచివాలయ ప్రాంగణంలో వారితో సమావేశమయ్యారు. మహిళా సంఘాలు కోరిన వెంటనే రుణాలు ఇవ్వాలని, ఇప్పటికే ఇచ్చిన వారికి గతంలో ఇచ్చిన దాని కంటే అదనంగా మంజూరు చేయాలని కోరారు. చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పాలనుకునే వారికి, వ్యాపారాభివృద్ధి చేసుకోవాలనుకునే వారికి 30శాతం ప్రభుత్వ సబ్సిడీతో రు.20,00,000ల వరకు రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు శిల్పా.భువనేశ్వరరెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ రాజేషకుమార్, డీఆర్‌డీఏ అధికారులు పుల్లయ్య, శివచెన్నరాయుడు, అయ్యన్న, రాంప్రకాశ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు కొలనుభారతిలో భీష్మ ఏకాదశి వేడుకలు



విద్యుద్దీపాలంకరణలో కొలనుభారతి దేవి ఆలయం

కొత్తపల్లి: రాష్ట్రంలో ఏకైక సరస్వతి క్షేత్రమైన మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో 65 భీష్మ ఏకాదశి వేడుకలను కాకనూరు శ్రీశారద పీఠం పీఠాధిపతి శుక్రవారం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన అమ్మవారి అలంకరణ కార్యక్రమం, ఆలయ అలంకరణ కార్యక్రమాలు గురువారం పూర్తయ్యాయి. విద్యుత్ దీపాలతో ఆలయ అలంకరణ, హోమగుండాలు, భక్తులు సేద తీరేందుకు టెంటులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్యశ్రీ కార్డులు



లబ్ధిదారుడికి ఆరోగ్య శ్రీ కార్డు అందజేస్తున్న ఎంపీడీఓ సరస్వతి

పాములపాడు: గ్రామాల్లో ప్రతి కుటుంబానికీ ఆరోగ్య శ్రీ కార్డులు అందజేయాలని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీని పరిశీలించారు. ప్రతి కార్డు దారుడి ఈకేవైసీ చేయిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కార్డు ఇచ్చిన వెంటనే కుటుంబీకుడితో తప్పని సరిగా ఈకేవైసీ చేయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, గ్రామ వలంటీర్లు ఉన్నారు.

నీటి సమస్య పరిష్కారం



వ్యవసాయ బోరుబావి నుంచి పైపులైన్ కనెక్షన్ ఇచ్చిన దృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో నీటి సమస్య తలెత్తి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బోరుబావికి అవసరమైన మోటార్, పైపులు, వైరు అమర్చేందుకు దాదాపు రూ. 2 లక్షలు ఇచ్చి సమస్యను పరిష్కరించారని సర్పంచ్ పాపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. దీంతో సర్పంచ్ సొంత పొలంలోని బోరుబావిలో మోటర్, పైపులు అమర్చి గ్రామంలోని జీహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు కనెక్షన్ ఇచ్చి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

రైతు భరోసా కేంద్రాల్లో జొన్న కొనుగోళ్లు

వెలుగోడు: రైతు భరోసా కేంద్రాల్లో జొన్న కొనుగోలు చేస్తామని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. గురువారం రేగడగూడురు, వేల్పనూరు రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. 2023–24 రబీ సీజన్లో మండలంలో 1450 ఎకరాలలో జొన్న పంటను సాగు చేశారని చెప్పారు. జొన్న పంట దిగుబడులను ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. క్వింటా జొన్నరూ. 3180 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. హమాలి, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ఎఫ్ఎ క్యూ నాణ్యతకు లోబడి కొనుగోలు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈఓ సుధారాణి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది లక్ష్మీ ప్రసన్న, రూప, రైతులు రమణారెడ్డి, తిరుపాలు పలువురు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మహానంది: బండిఆత్మకూరు మండలం అయ్యవారికోడూరులో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు గ్రామ సర్పంచ్ జ్ఞానాభరణం తెలిపారు. ఏ.కోడూరులోని ముస్లిం కాలనీలో మోటారు కాలిపోవడంతో గురువారం మరమ్మతులు చేపట్టారు. దీంతో పాటు అదనపు పైపులు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు.

ఈవీఎంలపై అవగాహన



బొల్లవరంలో అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఓ

మహానంది: జిల్లాస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మహానంది మండల ఏఎస్‌ఓ మురళీధర్‌రెడ్డి తెలిపారు. బొల్లవరం గ్రామంలో గురువారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఏఎస్‌ఓ మాట్లాడుతూ ఓటు వేసిన వ్యక్తులు ఎవరికి ఓటు వేశామన్నది చూసుకోవచ్చని చెప్పారు. ఈవీఎంలపై అపోహలు పెట్టుకోవద్దని, ఎలాంటి లోపాలు ఉండదని తెలిపారు.

గ్రామాల చెంతకే ఆధార్ సేవలు

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రజలకు అత్యవసరమైన ఆధార్‌సేవలను గ్రామాల చెంతకే తీసుకువచ్చిందని సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం మండలలోని ఎదురుపాడు గ్రామసచివాలయంలో ఆధార్‌క్యాంపును నిర్వహించారు. కొక్కెరంచ, నాగంపల్లి, జడ్డువారిపల్లె గ్రామాలకు చెందిన 17 మంది ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారన్నారు.

నేడు దుద్యాలలో ఆధార్ క్యాంపు

శుక్రవారం దుద్యాల గ్రామంలో నందికుంట, దుద్యాల గ్రామాల ప్రజలకు ఆధార్ క్యాంపు నిర్వహించి ఆధార్ సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. ఆ గ్రామాల ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

నేడు జలకనూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

మిడుతూరు: మండలపరిధిలోని జలకనూరు గ్రామంలోని సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మహానంది: బండిఆత్మకూరులోని మండల పరిషత్ కారాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్
- వలంటీర్లకు వందనం కార్యక్రమం



సన్మాన గ్రహీతలతో డాక్టర్ దారా సుధీర్, ప్రజాప్రతినిధులు

మిడుతూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, వలంటీర్లు ప్రతి కుటుంబానికి సంక్షేమ సారథులుగా సేవలందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవ వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర, పురస్కారాలను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ , వలంటీర్ వ్యవస్థతో ప్రజల ముంగిటకే పాలన తీసుకెళ్లారని చెప్పారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థతో గడప గడపకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నారన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సన్మానించి పురస్కారాలను అందజేశారు కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మమ్మ, ఎంపీడీఓ గంగావతి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ నబిర సూల్, పార్టీ నేతలు తువ్వా లోకేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పేరెడ్డి వెంకటరామిరెడ్డి, నాగస్వామిరెడ్డి, ఉషారాణి, కృష్ణవేణి, ఇందిరమ్మ, మౌలా, హరి సర్వోత్తమరెడ్డి, రవికుమార్, జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

- ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- రూ. 3. 66 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి
- డాక్టర్ దారా సుధీర్‌తో కలసి రోడ్డు ప్రారంభం



సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ దారా సుధీర్

నందికొట్కూరు: పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మారుతీనగర్‌లో పూర్తయిన ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే సీసీ రోడ్డును వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్‌తో కలసి ప్రారంభించారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పెషల్ నిధుల కింద రూ. 3.66 కోట్లు వెచ్చించి నాలుగు కిలో మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణ పూర్తి చేయడం జరిగిందన్నారు. దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని గుర్తు చేశారు.

ప్రత్యేక నిధులతో పట్టణంలో అభివృద్ధి పనులు

పట్టణంలో పెద్ద ఎత్తున్న ప్రత్యేక నిధులు తెచ్చి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేస్తునట్లు సిద్ధార్థరెడ్డి చెప్పారు. పట్టణంలో ప్రజలకు తాగునీటికి అంతరాయం లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

గెలుపేలక్ష్యంగా పనిచేయాలి

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిపే లక్ష్యంగా పని చేయాలని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని దాదా సుధీర్ పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని తెలిపారు. అంతకుమునుపు హాజీనగర్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు, లాలు, రవూఫ్, అశోక్, చాంద్‌బాషా, చిన్నిరాజు, నాయబ్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, గఫార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఉస్మాన్‌బేగ్, పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు ఉపేంద్రారెడ్డి, డాక్టర్ రషీద్, ఆర్ట్ శ్రీను, వీఆర్ శ్రీను, కుర్వ శ్రీను, బ్రహ్మయ్య, రమేష్, గోల, హుసేనయ్య, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అవగాహన ఉండాలి



పాడి రైతుకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ భాస్కర్

పాములపాడు: పశువులకు సోకే వ్యాధుల పట్ల పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలని పశు వైద్యాధికారి భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని యర్రగూడూరు గ్రామంలో పి.ఎస్ఎస్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రధానంగా దూడలకు నట్టల నివారణ మందులు, ఎదకు రాని పశువులకు ట్యాబ్లెట్లు, పాల దిగుబడి పెరిగేందుకు, ఎద్దులకు ఆకలి పెరిగేందుకు మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏపీ మిల్క్ ప్రొక్యూర్మెంట్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సేఫ్టీ మిల్క్ స్టాండర్డ్స్ యాక్ట్ 2023 పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బత్తుల సంజీవరాయుడు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, గోపాల మిత్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

మహానంది: ప్రైవేటు లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మహానందిలోని లాడ్జీల నిర్వాహకులతో గురువారం పోలీస్‌స్టేషన్ వద్ద సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మహానందికి వచ్చే భక్తులు, పర్యాటకులకు వివరాలు, రికార్డులు లేకుండా గదులను ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే భక్తుల నుంచి అధికంగా అద్దెలు వసూలు చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. భక్తులు, పర్యాటకుల నుంచి ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు ప్రసాద్‌రెడ్డి వద్ద 48 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



కిట్‌ను అందిస్తున్న వైద్య సిబ్బంది

శ్రీశైలం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు 15 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు సెంట్రల్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సహకారంతో టీబీ యూనిట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను అందించారు. క్రమం తప్పకుండా మందులు వాడాలని వైద్యాధికారులు షేనాజ్, స్ఫూర్తి, బోజిరెడ్డి, శ్రీవాణి సూచించారు. అనంతరం వైద్యధికారులు మార్చి 3 నుంచి 6వ తేదీ వరకు జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమానికి హెల్త్ అసిస్టెంట్స్, ఆశ, వలంటీర్‌లకు ట్రైనింగ్ ఇచ్చి సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో బీహెచ్ఎస్ రేణుక, ఎంపీహెచ్ఈఓ నజీర్ అహ్మద్, టీబీ సూపర్‌వైజర్లు రవికుమార్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

25న జిల్లాస్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 25వ తేదీన స్థానిక నెరవాటి ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి చెస్ పోటీలు ఓపెన్ కేటగిరిలో నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బారెడ్డి గురువారం తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి రూ.22వేలు నగదుతో పాటు జ్ఞాపిక అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 24వ తేదీ లోగా ఎంట్రీ నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 9010451585 నెంబరు సంప్రదించాలని కోరారు.

సత్రాల నిర్వాహకులు సహకరించాలి



మాట్లాడుతున్న దేవస్థానం ఈఓ పెద్దిరాజు

శ్రీశైలం టెంపుల్: భక్తులకు సౌకర్యాల కల్పనలో సత్రాల నిర్వాహకులు సహకరించాలని శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు కోరారు. శ్రీశైలంలో మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం సాయంత్రం స్థానిక సత్రాల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ క్షేత్రాన్ని సందర్శించే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోందన్నారు. అన్ని సత్రాల వారు సేవాదృక్పథంతో భక్తులకు సేవలు అందించాలన్నారు. సత్రాలకు దేవస్థానం నుంచి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని చెప్పారు. ఉత్సవ సమయాలలో భక్తులు వారు దిగిన చోటు నుంచి ఆయా కూడళ్లకు వెళ్లేందుకు దేవస్థానం ఉచిత బస్సు సదుపాయాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని సత్రాల వారు సరుకులు, సామగ్రిని ముందుగానే కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. భద్రతా చర్యలలో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో శ్రీశైలం తహసీల్దార్ గురప్ప, డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కుమార్, స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

దుద్యాల గ్రామంలో 'పల్లెనిద్ర'



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగభూషణ్

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో గురువారం రాత్రి ఆత్మకూరు సీఐ నాగభూషణ్ కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్‌తో కలసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు సైబర్ నేరాలు, వాహనాల నిబంధనలు, ఎన్నికల నియమాలు, సీసీ కెమెరాల ఉపయోగం, సెల్ ఫోన్ వాడకంతో అనర్థాలు వివిధ విషయాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల సమయం ఆసన్నమవుతున్న వేళ గ్రామాలలో ప్రజలందరూ అల్లర్లకు, ఘర్షణలు, గొడవలకు పోకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

బండి నారాయణ కుటుంబ సభ్యులకు పరామర్శ



బండి నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం కొత్తపేట నివాసి బండి నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బండి నారాయణ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

గిరిజా కల్యాణంపై హరికథ



కల్యాణంపై హరికథ చెబుతున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధులలోనీ నిత్యకళా వేదిక పై కర్నూలుకు చెందిన యం. రాముడు భాగవతార్, వారిచే గిరిజా కల్యాణంపై హరికథ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కీబోర్డు సహకారాన్ని ఎం. శ్రీరాములు, తబలా సహకారాన్ని రమణ అందించారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



మున్సిపల్ నూతన కార్యాలయానికి భూమి చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పగిడ్యాల రోడ్డుకు డంప్ యార్డ్‌కు సమీపంలో నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి భూమిచేశారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు రాష్ట్రంలో ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లతో పాటు కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఉస్మాన్‌బేగ్, నాయకులు గుర్రాల భాస్కరరెడ్డి, సత్యనారాయణ, విజ్జి, వీఆర్ శ్రీను, కుర్వ శ్రీను, రవీంద్రారెడ్డి, రజినీకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



రమణయ్య (ఫైల్)

జూపాడుబంగ్లా: షాట్‌సర్క్యూట్‌తో దోమతెరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడిన రమణయ్య(86) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. ఏఎస్ఐ మేరీ జయంతి తెలిపిన వివరాల మేరకు... మృతుడు రమణయ్య ఈనెల 19న ఇంటికి సమీపంలో ఉన్న పశువుల షెడ్డులో దోమతెరపెట్టుకొని మంచంపై నిద్రించసాగాడు. గాఢనిద్రలో ఉండగా షాట్‌సర్క్యూట్ సంభవించడంతో మంచానికి పెట్టుకొన్న దోమతెరకు నిప్పంటుకుంది. మంచానికి మంటలు వ్యాపించి రమణయ్యకు అంటుకోవడంతో కేకలు వేయగా.. పక్క గదిలో నిద్రిస్తున్న అతని మనుమడు వచ్చి మంటలను ఆర్పి హుటాహుటినా కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుని కుమారుడు గిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం అంచె వద్ద గురువారం చేపట్టిన వాహనాల తనిఖీలో 22 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. తూర్పు ప్రాతకోట గ్రామానికి చెందిన శ్రీనువాసులు అనే వ్యక్తి ప్రభుత్వ అనుమతి లేకుండా 22 మద్యం బాటిళ్లను బైక్‌పై తరలిస్తూ పట్టుబడ్డాడని చెప్పారు. అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని బైక్ సీజ్ చేసి నిందితునిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని వెల్లడించారు.

రైతులపై కాల్పులు జరపడం హేయమైన చర్య

నందికొట్కూరు: శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పంజాబ్ రైతులపై హర్యాణ పోలీసులు కాల్పులు జరపడం హేయమైన చర్య అని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు అన్నారు. గురువారం పట్టణంలోని కేజీ రోడ్డుపై రైతులపై కాల్పులకు వ్యతిరేకంగా పటేల్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేటీకరించేందుకు నరేంద్రమోదీ మూడు చట్టాలను తీసుకురావడం దారుణమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గోపాల్, శేఖర్‌నాయుడు, పుల్లన్న, శివ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

పాములపాడు: రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షుడు స్వామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు అన్నారు. రైతుల పై కాల్పులు జరిపడంతో ఒక రైతు ప్రాణాలు కోల్పోగా చాలా మంది రైతులు తీవ్ర గాయాలైన ఘటనను నిరసిస్తూ గురువారం స్థానిక కేజీ రోడ్డు పై కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య, బాలయేసు, స్వామన్న, తదితరులు పాల్గొన్నారు.